
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 18 । జూన్ । 2025



సోమశిలలో 37.180 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 37.180 టీఎంసీలు ఉన్నాయి. 93 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. డెల్టాకు 3,880, ఉత్తర, దక్షిణ కాలువలకు 1075 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.1,01,830
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.9,207
3 శాతం జీఎస్టీతో	రూ.9,483
నవర (8 గ్రా)	రూ.75,864

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.5 /29.2

జిల్లాలో ఉష్ణోగ్రతలు బుధవారం మరికొంత పెరగవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ మంగళవారం 44 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

పొగాకు కేజీ కనిష్ట ధర రూ.180

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 567 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 835 బేళ్లు రాగా 567 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 72741.1 కిలోల పొగాకు విక్రయించారు. కిలోకు గరిష్టంగా రూ.280, సగటున రూ.245.07 నమోదైంది. వేలంలో 9 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

389 బేళ్ల కొనుగోలు

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం 389 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 121 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్ట ధర రూ. 280, కనిష్ట ధర రూ.180 రాగా, సగటున రూ.242.73 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

ఏడు కనెక్షన్ల సమస్యను పరిష్కరించాం

- ఏఈ జమీల

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణానికి చెందిన బైసాని సత్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతుల ఇద్దరు కుమారులకు 'తల్లికి వందనం' పథకం అమలు కాలేదు. సత్యనారాయణ ఆధార్ కార్డుతో 7 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు రికార్డులో నమోదు కావడంతో ఆ కుటుంబంలోని పిల్లలకు 'తల్లికి వందనం' మంజూరు కాలేదు. 'ఇల్లే లేదు.. ఏడు కనెక్షన్లట' శీర్షికన సాక్షిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ జమీల బాధితులను కార్యాలయానికి పిలిపించి రికార్డులను పరిశీలించి సొంత ఇల్లు సైతం లేని వారి పేరుతో ఉన్న విద్యుత్ కనెక్షన్లను మార్పు చేస్తున్నట్లు సమస్య పరిష్కరించి ఆయనకు ఎన్‌ఓసీ పత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పదవులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురికి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ మంగళవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా నెల్లూరు సిటీ నియోజకవర్గానికి చెందిన మహమ్మద్ రౌఫుద్దీన్, రాష్ట్ర ఎస్టీ విభాగం జాయింట్ సెక్రటరీలుగా కోవూరు నియోజక వర్గానికి చెందిన దేవి విష్ణువర్ధన్, సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన బదనపూరి గోపయ్య, అంగన్‌వాడీ వింగ్ జనరల్ సెక్రటరీగా కోవూరు నియోజకవర్గానికి చెందిన ఏడెం లక్ష్మీకుమారి, కల్చరల్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన కందిగుంట వెంకటరెడ్డి, కల్చరల్ వింగ్ రాష్ట్ర సెక్రటరీగా కావలి నియోజకవర్గానికి చెందిన కొమారి రాజు, అధికార ప్రతినిధిగా కందుకూరు నియోజక వర్గానికి చెందిన వల్లూరు కోటేశ్వరరావులను నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీలో వర్గపోరు

- ఒక వర్గం ఫ్లెక్సీల ధ్వంసం



దుత్తలూరు: మండలంలోని నర్రవాడ టీడీపీలో వర్గపోరు తార స్థాయికి చేరింది. వెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చించేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఫిర్యాదు స్వీకరించలేదని సదరు టీడీపీ నాయకులు తెలిపారు. దీనిపై గ్రామంలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. మరో వైపు అవతలి వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై దాడి చేశారని ఆరు గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీఓ విచారణ

కొడవలూరు: మండలంలోని రేగడిచెలిక, పాతవంగల్లు పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై కావలి డీఎల్‌పీఓ వెంకటరమణ మంగళవారం విచారణ చేశారు. రేగడిచెలిక పంచాయతీలో నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించారే తప్ప పనులు చేయలేదని గ్రామానికి చెందిన చెముకుల భాస్కర్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాల మేరకు కావలి డీఎల్పీఓ వెంకటరమణ మంగళవారం పంచాయతీ రికార్డులతోపాటు ఆయా పనులకు సంబంధించి పరిశీలించారు. పాతవంగల్లు పంచాయతీలో రూ.30 లక్షల నిధులు సర్పంచ్ భర్త ఖాతాలో వేసుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారని బొంతలపాళెంకు చెందిన నరేంద్ర ఫిర్యాదు చేయగా దీనిపైనా డీఎల్పీఓ విచారించారు. ఈ మేరకు సమగ్ర నివేదిక రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తానని డీఎల్పీఓ తెలిపారు.

ఆ చేపలు తింటే చేటే

చేపలు.. అదీ నెల్లూరు చేపల పులుసు అంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఫేమస్. వీటిల్లోని ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు గుండె ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును పెంచుతాయని వైద్యులు చెబుతున్నారు. కానీ ఇప్పుడు నెల్లూరు చేపలు తింటే గుండె, కిడ్నీ, జీర్ణాశయం జబ్బులతోపాటు ప్రధానంగా కేన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. చేపల పెంపకందారులు వీటికి కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాలను ఆహారంగా వేస్తుండడమే కారణమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

- జీర్ణాశయం, గుండె, కిడ్నీ వ్యాధులు వస్తాయని వైద్యుల హెచ్చరిక
- కేన్సర్ కూడా రావొచ్చని చెబుతున్న డాక్టర్లు
- వీటికి చికెన్ వేస్టే ఫీడింగ్
- కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో విచ్చలవిడిగా వినియోగం
- నిత్యం పట్టుబడుతున్న చికెన్ వ్యర్థాల వాహనాలు
- కట్టడి చేయలేకపోతున్న అధికార యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నాన్‌వెజ్ ఫుడ్‌లో ఆరోగ్యానికి చేపలు మంచివని వైద్యులు సూచిస్తుంటారు. సంప్రదాయంగా చెరువులు, వాగులు, జలాశయాల్లో పెరిగే చేపలు ఆరోగ్యానికి మేలు చేస్తుండగా, జిల్లాలో వేలాది ఎకరాల్లో కృత్రిమంగా పెంచుతున్న చేపలు తింటే మాత్రం చేటు తప్పదని అదే వైద్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో అరకొర మంది చేపల ఉత్పత్తిదారులు ఇలాంటి చికెన్ వ్యర్థాలను చాటుమాటున వినియోగిస్తుంటే.. కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. కోవూరు షాడో ఎమ్మెల్యే నేతృత్వంలో 'చికెన్ వేస్ట్ మాఫియా' ఏర్పాటైంది. కోవూరు నియోజకవర్గంలో అన్ని మండలాలతోపాటు, ఆత్మకూరు, సర్వేపల్లి మండలాల్లో కొన్ని గ్రామాల్లో చేపల పెంపకం జరుగుతోంది. ఈ మాఫియా కనుసన్నల్లోనే అన్ని ప్రాంతాలకు కుళ్లిన చికెన్ వ్యర్థాలను తెచ్చి వినియోగిస్తున్నారు. నెలకు రూ.కోట్లల్లో ఈ వ్యాపారం జరుగుతుంటే ఏ స్థాయిలో వినియోగం ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి తమ జేబులు నిండితే చాలన్నట్లుగా టీడీపీ నేతలు కాసులు పిండుకుంటున్నారు. పోలీసులు, మత్స్యకార అధికారుల సహకారంతో ఇదంతా జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇతర రాష్ట్రాల్లో డంపింగ్ యార్డులు

పర్యావరణాన్ని కాపాడే చర్యల్లో భాగంగా చేపలు, రొయ్యలకు మేతగా కుళ్లిన మాంసాన్ని వేయడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకుంది. అనేక దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించిన నేపథ్యంలో రెండేళ్ల క్రితం ప్రత్యేక జీఓ కూడా తెచ్చింది. దీంతో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు చికెన్ వేస్ట్‌ను నిర్వీర్యం చేస్తూ చర్యలు చేపట్టడంతో ఇది జిల్లాలో కూటమి నేతలకు వరంగా మారింది. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, సంగం ప్రాంతాలకు చెందిన టీడీపీ నేతలు కొందరు మాఫియాగా తయారయ్యారు. ఇందు కోసం బెంగళూరు, చెన్నై, కేరళ ప్రాంతంలో కోళ్ల వ్యర్థాల సేకరణకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. ఆయా రాష్ట్రాల్లో చికెన్ నుంచి వ్యర్థాల సేకరణ చేస్తున్నారు. కేజీ రూ.5 వంతున సేకరించి డంపింగ్ యార్డుల్లోకి చేర్చుకుని అక్కడి నుంచి రాత్రి వేళల్లో లోడింగ్ చేసి నెల్లూరుకు రవాణా చేస్తున్నారు.

నెలకు రూ.లక్షల్లో మామూళ్లు

ఈ వాహనాలు రాష్ట్రాల చెక్‌పోస్టులు, జిల్లాలోని టోల్‌గేట్లు దాటుకుని వస్తున్నప్పుడు వాటిని కట్టడి చేసే అవకాశం ఇటు పోలీసులకు, అటు మత్స్యశాఖ అధికారులు పెద్ద కష్టమేమి కాదు. వీటిని గుర్తించి కట్టడి చేసే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పోలీస్ శాఖకు ఒక్కో వాహనానికి రూ.10 వేలు వంతున నెలవారీ మామూళ్లు ముట్టజెప్పుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంటే నెలకు వంద వాహనాలు తిరిగితే నెలకు ఒక్కో స్టేషన్‌కు రూ.10 లక్షలు ఇస్తారు. సర్కిల్, డీఎస్పీ స్థాయి అధికారులతోపాటు మత్స్యశాఖ అధికారులకు ప్రత్యేకంగా మామూళ్లు ఇస్తారనే ఆరోపణలున్నాయి. బెంగళూరు నుంచి కడప సరిహద్దు ప్రాంతం నుంచి వాహనాలు వస్తాయి. చెన్నై, కేరళ నుంచి జాతీయ రహదారి నుంచే వాహనాలు వస్తాయి. ఆయా ప్రాంతాల్లో ప్రతి స్టేషన్‌కు, సర్కిల్‌కు నెలవారీ మామూళ్లు ఇస్తుండడంతో ఏ అధికారి ఆ వాహనాల జోలికి వెళ్లడం లేదు. అడపాదడపా రోడ్డు ప్రమాదాలు, వాహనం పాడైతే మాత్రం వ్యర్థాల రవాణా వెలుగులోకి వస్తున్నాయి

చేతులెత్తేసిన ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చికెన్ వ్యర్థాల మాఫియా బరితెగించింది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చికెన్ వ్యర్థాల విషయంపై పోలీస్ శాఖకు ఆదేశాలిచ్చారు. నాలుగు నెలల తర్వాత కట్టడి చేస్తామని, క్రాప్ మధ్యలో ఉందని చెప్పారు. కానీ ఎక్కడా ఎమ్మెల్యే ఆదేశాలు అమలు చేయడం లేదు. అడపాదడపా పోలీసులు వాహనాల పట్టివేత చూపిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఆత్మకూరు మండంలోని వాసిలి ప్రాంతంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న జనసేన కార్యకర్తలు చికెన్ వ్యర్థాల డంపింగ్ కేంద్రాన్ని చూపించి పోలీసులకు పట్టించారు. ఇంత జరుగుతున్నా.. పాలకులకు తెలియకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఫీడింగ్ ఖర్చు తగ్గించుకునేందుకు..

జిల్లాలో ప్రధానంగా కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఇందుకూరుపేట, విడవలూరు, ఆత్మకూరు రూరల్, సంగం, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో వేల ఎకరాల్లో చేపల పెంపకం జరుగుతోంది. అయితే చేపలకు వినియోగించే ఫీడ్ (ఆహారం) ఖరీదు కావడంతో వీటి పోషణ రైతులకు భారంగా మారింది. సాధారణంగా చేపలు ఒక కేజీ పైబడి పెరగడానికి ఆరు నుంచి ఎనిమిది నెలలు పడుతోంది. రైతుల దగ్గర వ్యాపారులు చేపలను కేజీ రూ.80 నుంచి రూ.90లకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు నష్టాలే ఎక్కువగా వస్తున్నాయి. అదే కోళ్ల మేతగా బ్రాండెడ్ ఫీడ్‌కు బదులు, ప్రత్యామ్నాయంగా అతి తక్కువ ఖర్చుతో కూడిన కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగించడంతో నాలుగు నెలలకే కేజీ, అంతకు మించిన బరువు పెరుగుతున్నాయి. దీంతో జిల్లాలో దాదాపు 80 శాతం మంది చేపల రైతులు కోళ్ల వ్యర్థాలనే వినియోగిస్తున్నారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలు జిల్లాకు తెచ్చి విక్రయించే మాఫియా తయారైంది. అక్కడ కేజీకి ఐదారు రూపాయలకు కొనుగోలు చేసి ఇక్కడ రూ.15లకు విక్రయిస్తున్నారు. ఈ విధంగా నెలకు సుమారుగా రూ.10 కోట్ల మేర వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.

ప్రాణాంతక వ్యాధులు వస్తాయి



చికెన్ వ్యర్థాల్లో పలు రకాల సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియాలు, శిలీంద్రాలు, వైరస్‌లు ఉంటాయి. తగిన విధంగా ప్రాసెస్ చేయకుండా, చేపలకు నేరుగా ఆహారంగా వేయడం వల్ల ఈ–కోలీ వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియాలు ఉంటాయి. దీని వల్ల చేపలతోపాటు మనుషులకు ప్రమాదకరమైన జబ్బులు కలిగిస్తాయి. చేపలను శుభ్రపరిచేటప్పుడు వాటిని తాకిన మనుషులకు అలెర్జీలు, టైఫాయిడ్ జబ్బులు రావొచ్చు. వ్యర్థాల్లో ఉండే అమ్మోనియా నీటిలో కలుషితం కావడం వల్ల ఆర్సెనిక్, లెడ్ వంటి విషపూరితమైన మూలకాలు నీటిలో కలిసే ప్రమాదం ఉంది. జ్ఞాపక శక్తి తగ్గిపోవడంతో పాటు, నరాల బలహీనతలు వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, సీనియర్ వైద్యుడు, పీపీసీ

నీరు, ఆహారం కలుషితం



చికెన్ వ్యర్థాలను చేపలకు ఆహారంగా గుంతల్లో వేసినప్పుడు నీరు కలుషితమవుతోంది. పాత నీటిని వదిలి కొత్త నీటిని గుంతల్లోకి వదిలే క్రమంలో ఒక చోట నుంచి మరో చోటుకు కలుషితమైన నీరు చేరడం ద్వారా మానవులకు చర్మ సంబంధిత రోగాలు వస్తాయి. ఇలాంటి చేపలను తినడం ద్వారా మనుషులకు సులభతరంగా జబ్బులు అంటుకుంటున్నాయి. చేపల్లో చేరిన సీసం ద్వారా మనుషుల్లో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఉదర సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. అందువల్ల చికెన్ వ్యర్థాలను చేపల గుంతల్లో వేయడం మంచిది కాదు.

– డాక్టర్ వై.గంగాధర్, ఎండీ, ఫిజీషియన్, లీడ్ హాస్పిటల్, నెల్లూరు

మృత్యువై దూసుకొచ్చిన మినీ వ్యాన్



పరుసుబోయిన వెంకటేశ్వర్లు(ఫైల్)



స్వర్ణలత (ఫైల్)



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఆదిలక్ష్మి

మృత్యువు ఏ రూపంలో వస్తుందో తెలియదు. ఆరు పదులు దాటిన వయస్సులో కూడా బిడ్డలపై ఆధార పడకుండా ఆ దంపతులు చిరు వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. కావలి– ఉదయగిరి రోడ్డుకు సుమారు ముప్పై అడుగుల దూరంలో నివాసం ఏర్పాటు చేసుకుని అందులోనే చిన్నపాటి ఫలసరుకుల దుకాణం నిర్వహించుకుంటున్నారు. ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. తమ ఇంట్లోనే ఉంటున్న ఆ దంపతులపైకి ఊహించని మృత్యువులా మినీ వ్యాన్ దూసుకొచ్చింది. దంపతుల శరీర భాగాలు నుజ్జునుజ్జుగా మారి చెల్లాచెదురుగా పడిపోవడం చూస్తే.. దుర్ఘటన తీవ్రతను తెలియజేస్తోంది.

దుకాణంలో ఉన్న దంపతులు దుర్మరణం

దుత్తలూరు: మితిమీరిన వేగంతో వచ్చిన ఓ మినీ వ్యాను రోడ్డు పక్కనే ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లడంతో దంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మంగళవారం బ్రహ్మేశ్వరం ఎస్సీ కాలనీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన పరుసుబోయిన వెంకటేశ్వర్లు (65) అతని భార్య స్వర్ణలత (63) బ్రహ్మేశ్వరం ఎస్సీ కాలనీ సమీపంలో దుత్తలూరు–వింజమూరు జాతీయ రహదారి పక్కన చిన్నపాటి చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం కూడా భార్యాభర్తలిద్దరూ దుకాణం తెరిచి అక్కడే ఉన్నారు. వెంకటేశ్వర్లుకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో అతను మంచం మీద పడుకుని ఉన్నాడు. ఈ క్రమంలో నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాల పూల అలంకరణకు సంబంధించిన సామగ్రి తీసుకుని ఆత్మకూరుకు వెళుతున్న మినీ వ్యాను డ్రైవరు నిద్రమత్తులో వాహనం నడపడంతో అదుపు తప్పి జాతీయ రహదారి మార్జిన్ దిగి సుమారు 30 అడుగుల దూరంలో ఉన్న దుకాణంలోకి వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘటనలో మంచంపై పడుకొని ఉన్న వెంకటేశ్వర్లుతోపాటు పక్కనే ఉన్న అతని భార్య స్వర్ణలతను కూడా మినీ వ్యాను ఈడ్చుకెళ్లింది. ఈ దుర్ఘటనలో దంపతులిద్దరూ అక్కడికక్కడే తీవ్ర గాయాలై మృతిచెందారు. వెంకటేశ్వర్లు ట్రక్కు కింద ఇరుక్కుపోవడంతో స్థానికుల సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంలో దంపతుల శరీర భాగాలు నుజ్జునుజ్జుగా మారి చెల్లాచెదురుగా పడిపోవడంతో అక్కడికి చేరుకున్న ప్రజలు చలించిపోయారు. బతుకుదెరువు కోసం చిల్లర దుకాణం నిర్వహిస్తున్న వీరిరువురూ ఒకేసారి దుర్మరణం చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఆదిలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దంపతులిద్దరూ ప్రమాదానికి గురై మృతి చెందారన్న విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలకు ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు. మృతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

మండలంలోని గంగిరెడ్డిపల్లెలో ఉన్న అనంతపురి గంగాభవాని తిరునాళ్లలో భాగంగా మంగళవారం ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కడపకు చెందిన విద్యా ఓబులేరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానం, బద్వేల్‌కు చెందిన వినుకొండ రఫీ ఎద్దులు ద్వితీయ స్థానం, మర్రిపాడు మండలం తిక్కవరం గ్రామానికి చెందిన బాలనరసింహా నాయుడు ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా ఆలయ కమిటీ రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు వంతున నగదు బహుమతిని అందించి సన్మానించారు.

– ఉదయగిరిరూరల్



బండను లాగుతున్న ఎద్దులు

ప్రైవేట్ గుప్పెట్లోకి ప్రభుత్వ వైద్యం

- గత ప్రభుత్వంలో కొత్తగా 17 వైద్య కళాశాలల నిర్మాణం
- వాటిని ప్రభుత్వమే నిర్వహించాలి
- పీపీసీ పేరుతో ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకునేదిలేదు
- ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు



మాట్లాడుతున్న ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎంవీ రమణయ్య, కామేశ్వరరావు

నెల్లూరు (అర్బన్): ప్రభుత్వ వైద్య రంగాన్ని పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీసీ) పేరుతో ప్రైవేట్ యాజమాన్యాల చేతికి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంటోందని ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎంవీ రమణయ్య, కామేశ్వరరావు ఆరోపించారు. మంగళవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల అనే లక్ష్యంతో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు నిర్మించిందన్నారు. వీటిలో గత ప్రభుత్వం ప్రారంభించిన నూతన వైద్యకళాశాలలతోపాటు నిర్మాణంలో చివరి దశలో ఉన్న వైద్య కళాశాలలను పీపీపీ మోడ్‌లో ప్రైవేట్ వారికి అప్పగిస్తామని కూటమి ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించడం దారుణమన్నారు. ఇదే జరిగితే పేదలకు సరైన వైద్యం అందదన్నారు. ప్రజలు వైద్యం కోసం ఎక్కడికెళ్లాలని ప్రశ్నించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను ప్రభుత్వ వైద్యులు కాపాడితే కార్పొరేట్ వైద్యులు తాళాలు వేసుకున్నారని, కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులు రూ.కోట్లు సంపాదించుకున్నారని విమర్శించారు. ప్రభుత్వం తన విధానం మార్చుకోకపోతే రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు చేసి మెడికల్ సీట్లు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. పేద, అణగారిన వర్గాల వారికి సీట్లు దక్కవన్నారు. రిజర్వేషన్లు కూడా అమలు జరగవన్నారు. కర్ణాటక, ముంబైలో పీపీపీ మోడ్‌లో నడుస్తున్న ప్రభుత్వ వైద్యశాలలు విఫలమయ్యాయన్నారు. అలాంటి వ్యవస్థను రాష్ట్రంలో బలవంతంగా అమలు చేయొద్దన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్‌లో 50 శాతం సీట్లు ప్రభుత్వమే అమ్ముకునేందుకు వీలు కల్పించే జీఓ నంబర్ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీడీపీలో వైద్య రంగానికి 6 శాతం నిధులు కేటాయించాలని, నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానంలోనే వైద్య కళాశాలలు, ఆస్పత్రులను నడపాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సదస్సులకు మేధావులు, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటికే పలుమార్లు సీఎం చంద్రబాబుకు వినతి పత్రాలు పంపామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు, అనుబంధ ఆస్పత్రులను కొనసాగిస్తామని సీఎం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు జూలై నుంచి శ్రీకారం చుట్టుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు కామయ్య పాల్గొన్నారు.

సీబీఐ అధికారుల పేరుతో రూ.24 లక్షల స్వాహా

- కేసు నమోదు చేసిన పోలీసులు

నెల్లూరు (క్రైమ్): సీబీఐ అధికారుల పేరుతో ఓ వ్యక్తిని బెదిరించడంతోపాటు సెల్ఫ్ కస్టడీకి గురి చేసి రూ.24 లక్షలను సైబర్ నేరగాళ్లు దోచేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు డైకస్‌రోడ్డులో లక్ష్మీనరసింహం నివాసం ఉంటున్నారు. ఈ నెల 10వ తేదీన ఆయనకు గుర్తుతెలియని మహిళ ఫోన్ చేశారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ ట్రాఫికర్ సాదర్‌ఖాన్‌తో సంబంధాలున్నట్లు, అతనిపై ఇప్పటికే బెంగళూరులో అశోక్‌నగర్ పీఎస్‌లో కేసు నమోదైందని, ఈ విషయంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సీబీఐ అధికారి శివప్రసాద్ ఫోన్ చేస్తారని చెప్పింది. కొద్ది సేపటి తర్వాత శివప్రసాద్ అతనికి వీడియో కాల్ చేశారు. ముంబై కెనరా బ్యాంకులోని మీ ఖాతాలో హ్యూమన్ ట్రాఫికర్ రూ.30 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు విచారణలో వెల్లడైందని, మీ మీద కేసు నమోదైందని చెప్పి మూడు గంటల పాటు లక్ష్మీనరసింహంను సెల్ఫ్ కస్టడీ చేసి భయభ్రాంతులకు గురిచేశారు. మరుసటి రోజు సీబీఐ అధికారినంటూ మరో మహిళ ఫోన్ చేసి మీ అకౌంట్లను ఆడిట్ చేయాలని చెప్పి పలు దఫాలుగా అతని వద్ద నుంచి రూ.24,20,100 దోచేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు ఈ మేరకు మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పంచేడు గ్రామంలో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సోమవారం అర్ధరాత్రి గ్రామం మీదుగా చికెన్ వ్యర్థాలతో వాహనం వెళ్తుండగా స్థానికులు దుర్గంధం భరించలేక అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. రాత్రి వేళల్లో చికెన్ వ్యర్థాల వాహనాలు పదుల సంఖ్యలో తమ గ్రామం మీదుగా వెళ్తున్నాయని, పోలీసులు నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన రహదారితో ప్రజలకు ఉపయోగం



రోడ్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్ తదితరులు

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి మర్రిపాడు మండలం డీసీపల్లి మీదుగా వెన్నవాడ, గండ్లవేడులను తాకుతూ వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు పీఎంజీఎస్‌వై పథకంలో నిర్మిస్తున్న రహదారి మూడు మండలాలకు ప్రయోజనకరంగా ఉంటుందని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ అశోక్ పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణ పనులను తన శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గండ్లవేడు – నల్లగొండ్ల మధ్య నిర్మించిన తారు, సిమెంట్ రోడ్లతో పాటు వెన్నవాడ బొగ్గేరు వద్ద నూతనంగా నిర్మించిన కాజ్‌వే పనులను ఆయన క్షేత్ర పరిశీలన చేశారు. అనంతరం డీసీపల్లి – రామస్వామిపల్లి మధ్యలో నిర్మించిన సిమెంట్ రోడ్డు, తారురోడ్లను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం, పదిరోజుల్లో ఈ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అయితే వెన్నవాడ వద్ద సుమారు 250 మీటర్ల మేరకు స్థానికులు రహదారి నిర్మాణానికి ఇబ్బందులు కల్పిస్తున్న కారణంగా ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చిన తర్వాత నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ ప్రసాద్, గండ్లవేడు స్థానిక నాయకుడు కొల్లి దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల



2బీ కెనాల్ ద్వారా ప్రవహిస్తున్న నీరు

సైదాపురం: కండలేరు 2ఏ, 2బీ బ్రాంచ్ కెనాళ్లకు సాగునీరు విడుదల చేశారు. ఈ ఏడాది ఎడగారు పంటలకు సైదాపురం మండలానికి వచ్చే ప్రధాన కాలువలైన 2ఏ, 2బీ కెనాళ్లకు నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని తుమ్మల తలుపూరు, కలిచేడు, ఓరుపల్లి, మలిచేడు, కట్టబడిపల్లి, దేవరవేమూరు, తురిమెర్ల, ఊటుకూరు, గిద్దలూరు, జోగిపల్లి, పోక్కందల, ఆదూరుపల్లి, మొలకలపూండ్ల, సైదాపురం, రామసాగరం, పెరుమాళ్లపాడు, పరసారెడ్డిపల్లి చెరువులకు 2ఏ బ్రాంచి కెనాల్ ద్వారా సాగు నీరు వస్తోంది. సుమారు 16వేల మాగాణి భూములకు సాగునీరు అందనుండటంతో రైతులు పంటల సాగు చేపట్టనున్నారు. అలాగే 2బీ కాలువ ద్వారా చీకవోలు, అన్నంరాజుపల్లి, రాజులెరుగుంటపాళెం, పోతేగుంట, చాగణం, రాగనరామాపురం, తిప్పిరెడ్డిపల్లి, లింగసముద్రం, కమ్మువారిపల్లి, గంగదేవిపల్లి, అనంతమడుగు, పాలూరు, తోకలపూడి, వేములచేడు గ్రామాల్లో సుమారు 14,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

నిషాలో నేరాలు

కొందరు రాత్రి సమయంలో మద్యం తాగి ఉంటారు. దారిలో వెళ్లే వారిని అడ్డగించి బెదిరించి నగదు దోచుకుంటారు. ఒకప్పుడు ఇలాంటివి ఎక్కడో జరిగితే వినేవాళ్లం. నేడు నిత్యకృత్యమయ్యాయి. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలో ఈ తరహా ఘటనలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

- ఒంటరిగా కనిపిస్తే అంతే..
- కత్తులతో బెదిరించి నగదు, సెల్‌ఫోన్ల దోపిడీ
- వరుస ఘటనలతో భయం గుప్పిట్లో జనం
- పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలంటున్న నగరవాసులు



నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు ప్రాంతం (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. మద్యం, గంజాయి విచ్చలవిడి విక్రయాలతోపాటుగా ఇతర మత్తు ఉత్ప్రేరకాలు అందుబాటులో ఉంటుండటంతో నిషా మత్తులో నేరాలు అధికమయ్యాయి. ప్రశాంత సింహపురి నేరపురిగా మారుతోంది. పాతనేరస్తులు, వ్యసనాలకు బానిసైన కొందరు తమ అవసరాలకు సరిపడా నగదు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. కత్తులు, మారణాయుధాలను చేతబూని రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్లేవారిని చంపుతామని బెదిరించి, దౌర్జన్యం చేసి నగదు, సెల్‌ఫోన్లు దోచుకెళుతున్నారు. ఎదురు తిరిగిన వారిపై దాడులకు వెనుకాడటం లేదు. ఇంకొందరు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో ప్రజలపై దాడులు చేస్తున్నారు. నెల్లూరు నగరంలో ఆ ప్రాంతం, ఈ ప్రాంతం అని లేకుండా అన్నిచోట్లా ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. బాధితుల్లో కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుండగా మరికొందరు భయంతో పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు యథేచ్ఛగా నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు.

భయంతో..

ఏ వేళలో అయినా ప్రజలు నిర్భయంగా నగరంలో రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనుమరుగవుతోంది. ఇంటి నుంచి బయటకు వస్తే ఎప్పుడు ఏం జరుగుతుందో? ఎవరు దాడి చేస్తారోనన్న భయంతో నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. నేర నియంత్రణకు పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ పాతనేరస్తులు, ఆకతాయిల భరతం పడుతున్నా పరిస్థితుల్లో మాత్రం మార్పురావడం లేదు. ఇప్పటికైనా పోలీసు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలి. మత్తులోనే నేరాలు అధికంగా జరుగుతుండటంతో మద్యం అనధికార విక్రయాలు, గంజాయి విక్రయాలను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలి. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచి వారిపట్ల కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

ఇటీవల జరిగిన ఘటనలు

- పొట్టేపాళేనికి చెందిన ఓ యువకుడు నగరంలోని మందుల దుకాణంలో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో మద్యం మత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు అతడిని అడ్డగించి కత్తులతో బెదిరించి నగదు, బంగారు ఉంగరం దోచుకెళ్లారు.
- ఐపీఎల్ ఫైనల్స్ రోజు అర్ధరాత్రి కొందరు యువకులు మద్యం మత్తులో జాతీయ రహదారిపై వీరంగం చేశారు. వాహన రాకపోకలకు అంతరాయం కలిగించడంతోపాటు ప్రజలపై దౌర్జన్యం చేశారు.
- రంగనాయకులపేటకు చెందిన ఓ వ్యక్తిని చంపుతామని బెదిరించి రూ.1,500 దోచుకెళ్లారు.
- ముత్తుకూరు బస్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తులు ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళను చంపుతామని బెదిరించి రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు.
- మూడురోజుల క్రితం బీవీనగర్‌కు చెందిన ఓ యువకుడు ఇంటికి వెళుతుండగా మద్యం మత్తులో ఉన్న కొందరు అడ్డుకున్నారు. చంపుతామని బెదిరించి అతడి వద్దనున్న సెల్‌ఫోన్‌ను దోచుకెళ్లారు.



గ్రామోత్సవంలో కొలువుదీరిన దేవదేవేరులు



అంగరంగ వైభవం..
వెంగమాంబ బ్రహ్మోత్సవం

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు మూడురోజులుగా కనుల పండువగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వెంగమాంబ – గురవయ్య దంపతుల ఉత్సవమూర్తులను ఊరేగించారు. ఆలయ సన్నిధిలో సంతానం లేని మహిళలు అమ్మవారి ముందు వరపడ్డారు. ఆలయం నుంచి గ్రామోత్సవం కనుల పండువగా ప్రారంభమై నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెం మీదుగా సాగింది. అంతకుముందు నర్రవాడలో ఉత్సవ విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో చక్రస్నానం నిర్వహించారు. వెంగమాంబ దంపతులకు ఏటా పులివర్తి వంశీయులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అయితే ఈ ఏడాది ఆటంకం రావడంతో వారి తరఫున మల్లపాటి చెన్నయ్య – సునీత దంపతులు, నెల్లూరు మహానందం – తిరుపతమ్మ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేకాలంకరణ చేసి పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవానికి తీసుకెళ్లారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న భక్తులు

నేడు ప్రధాన ఘట్టాలు

ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధాన ఘట్టాలు నిర్వహిస్తారు. ఉదయం వడ్డిపాళెం నుంచి నర్రవాడ వరకు పసుపు, కుంకుమ ఉత్సవం, అనంతరం వెంగమాంబ – గురవయ్య దంపతుల కల్యాణోత్సవం, రాత్రి ప్రభోత్సవం జరుగుతాయి. వీఐపీలతో పాటు భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నట్లు ఉదయగిరి సీఐ వెంకట్రావు తెలిపారు.

లోగ్రేడ్ పొగాకును ప్రభుత్వమే కొనాలి



పొగాకు వేలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కందుకూరు: లోగ్రేడ్ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూల వెంకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పామూరు రోడ్డులోని వేలం కేంద్రం వద్ద పొగాకు రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను అమ్ముకుందామంటే మార్కెట్‌లో ధరలు నిరాశాజనకంగా ఉన్నాయన్నారు. కిలో గరిష్ట ధర రూ.280 వేస్తున్నారని, లోగ్రేడ్ ఒకటి, రెండు బేళ్లకు మాత్రమే రూ.180 వేస్తున్నారని చెప్పారు. మిగిలిన వాటిని నోబిడ్ వేయడం వల్ల రైతులు తిరిగి వెనక్కి తీసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కోసం రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అందరూ ముందుకొచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య మాట్లాడుతూ సంక్షోభ సమయంలో ప్రభుత్వాలు రంగంలోకి దిగి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఐటీసీ లాంటి సంస్థలతో లాలూచి పడకుండా పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలేటి కోటేశ్వరరావు, సీపీఎం నాయకులు ఎస్ఏ గౌస్, జి వెంకటేశ్వర్లు, జీవీబీ కుమార్, తానికొండ రమణయ్య, రైతులు వలేటి నరసింహం, అల్లం సుమతి, బ్రహ్మయ్య, మాదాల మాధవ, మామిళ్లపల్లి మాధవ, దామా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

20వ తేదీ ఒంగోలులో రాష్ట్ర స్థాయి సదస్సు

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఒంగోలులోని మల్లలింగయ్య భవన్‌లో నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని కార్యవర్గ సభ్యుడు కె.వీరారెడ్డి కోరారు. మంగళవారం కందుకూరులోని ఒకటి, రెండు వేలం కేంద్రాలను సీపీఐ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి అంతర్జాతీయ మార్కెట్‌ను సాకుగా చూపి ధరలు తగ్గిస్తున్నాయని ఆరోపించారు. గతేడాది హై గ్రేడ్‌ను క్వింటా రూ.36 వేలకు కొనుగోలు చేస్తే ఈ ఏడాది రూ.28 వేలకు కొంటున్నారన్నారు. మీడియం గ్రేడ్‌ను రూ.35 వేలకు గతేడాది కొనుగోలు చేస్తే ప్రస్తుతం రూ.25 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఇక లోగ్రేడ్‌ను కొనడమేలేదని వివరించారు. ప్రస్తుతం సరాసరి ధర రూ.243.51 మాత్రమే ఉందని అంటే రోజు రోజుకు ధరలు పతనమవుతున్నట్లు అర్థమవుతుందన్నారు. సదస్సుకు పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనందమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి..

- 108 ఉద్యోగి మృతి

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి గ్రామం వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న 108 అంబులెన్స్ ఉద్యోగి ఓంకారం వెంకటనారాయణ రాజు (38) ప్రమాదవశాత్తు జారిపడి మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. సోమవారం 108లో నైట్ డ్యూటీ చేసిన వెంకటనారాయణరాజు మంగళవారం ఉదయం తన బంధువులు అనారోగ్యానికి గురికావడంతో వారిని ఉదయగిరిలోని ఆస్పత్రిలో చూపించేందుకు ఆటోలో బయలుదేరాడు. డ్రైవర్ పక్కన కూర్చున్న రాజు మార్గమధ్యలో నిద్రమత్తులో ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి రోడ్డుపై పడి గాయాలపాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉదయగిరికి తరలించారు.



వెంకటనారాయణరాజు మృతదేహం

కండలేరులో 36.456 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 36.456 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 2,280, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): భార్యను హత్య చేసిన భర్తను పోలీసులు అరెస్ట్‌చేశారు. మంగళవారం నెల్లూరు బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.సాంబశివరావు హత్యకు దారితీసిన పరిస్థితులను వెల్లడించారు. బాలాజీనగర్ వైకే ఆచారి స్కూల్ వీధిలో ఎల్.విజయచంద్ర, శైలజ (46) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు సంతానం. విజయచంద్ర ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శైలజ తండ్రి ఆస్తి కోసం చెన్నై కోర్టులో కేసు వేసి ఓడిపోయింది. కేసుకు సంబంధించి ఆమె భర్తచే రూ.40 లక్షలకు పైగా అప్పు చేయించింది. దీని కారణంగా విజయచంద్ర పిల్లల ఫీజులు సైతం కట్టలేకపోయాడు. ఈ క్రమంలోనే శైలజ భర్తపై అనుమానం పెంచుకుని వేధించసాగింది. విధులకు వెళ్లినా వీడియో కాల్స్ చేస్తుండేది. వేధింపులు తాళలేని విజయచంద్ర భార్యను ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 14వ తేదీన అతను కుమారులను భోజనం తీసుకురావాలని ఇంటి నుంచి బయటకు పంపాడు. పథకం ప్రకారం భార్య గొంతుకు టవల్ బిగించి చంపేందుకు యత్నించాడు. ఆమె చావకపోవడంతో రోకలిబండతో బలంగా తలపై కొట్టాడు. ఆమె మృతిచెందిందని నిర్ధారించుకున్న అనంతరం విజయచంద్ర పరారయ్యాడు. మృతురాలి పెద్దకుమారుడు ఎల్.శ్యామ్‌సాత్విక్ ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడిని ఇన్‌స్పెక్టర్ సోమవారం అరెస్ట్ చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు

బావిలో పడి బాలిక మృతి

వెంకటాచలం: ప్రమాదవశాత్తు జారి బావిలో పడి బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని అనికేపల్లి పంచాయతీ రామాపురం గిరిజనకాలనీలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. యాకసిరి పోలయ్య కుమార్తె శ్రీవల్లి (9) గొలగమూడిలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం గిరిజన కాలనీలో తోటి పిల్లలతో ఆడుతుండగా ప్రమాదవశాత్తు కాలనీలోని బావిలో జారి పడింది. పిల్లలు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు బావి వద్దకు చేరుకుని బాలికను బయటకు తీశారు. అప్పటికే మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

రాపూరు: మండలంలోని జోరేపల్లి అక్కమాంబపురంలో మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్ నరసింహంకు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 67లో సుమారు 70 ఎకరాలు ప్రభుత్వ మేత పోరంబోకు భూమి ఉందన్నారు. కొంతమంది ఆ భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నారని చెప్పారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.10

పేలుడు సామగ్రి స్వాధీనం



సిబ్బంది స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి



తవ్వకాలు జరిగిన ప్రాంతంలో ముఠా వదిలివెళ్లిన సామగ్రి

ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయన్న విషయం వెలుగులోకి రావడంతో మంగళవారం అటవీ, పోలీసు శాఖ సిబ్బంది స్పందించారు. దుర్గంపైకి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా దుర్గంపైన ఉన్న రామ బుగ్గ, కరీమ్ బుగ్గ ప్రాంతంలో తవ్వకాలు జరిపినట్లుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో గుప్తనిధుల తవ్వకందారులు వదిలివెళ్లిన పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. 16 జిలెటిన్ స్టిక్స్‌తోపాటు విద్యుత్ వైర్లు, పేలుడుకు ఉపయోగించే స్టార్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముఠా కొన్నిరోజులనుంచి దుర్గంపైనే మకాం పెట్టి భారీ స్థాయిలో తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. విలువైన సంపదను కూడా ఈ తవ్వకందారులు తీసుకెళ్లి ఉంటారనే ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. శనివారం రాత్రి ఉదయగిరిలోని దిలావర్‌భాయి వీధికి చెందిన పలువురు యువకులు పార్టీ చేసుకునేందుకు దుర్గంపైకి వెళ్లారు. వారిని గమనించి గుప్తనిధుల తవ్వకందారుల ముఠా పరారైనట్లు తెలుస్తోంది.